క్లుప్తంగా

స్నేహితుల ఆర్థిక సాయం



సాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

ఐ.పోలవరం: ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్ గేట్ వద్ద ఇటీవల జరిగిన విద్యుత్ దుర్ఘటనలో మరణించిన కాంట్రాక్టు లైన్‌మన్ మోర్త సాయి కుటుంబానికి అతని స్నేహితులు ఆర్థికసాయం అందించారు. మురమళ్ల హైస్కూల్‌లో చదివిన 1996 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.35,600 నగదు అందజేశారు. సాయి చిత్రపటానికి నివాళులర్పించారు. తమతో సాయికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

అమలాపురం రూరల్: అమలాపురం మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బ్లాక్ స్థాయిలో (ఎన్‌సీడబ్ల్యూ) విధాన్ సే సమాధాన్ పేరిట మహిళలతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయ అవగాహన సదస్సులో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో విశ్వశాంతి యజ్ఞం

అమలాపురం రూరల్: ఇటీవల రావులచెరువులో జరిగిన అగ్నిప్రమాద దుర్ఘటనకు శాంతిగా జనుపల్లి గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం ఇస్కాన్ రామాలయ ప్రాంగణంలో గురువారం విశ్వశాంతి యజ్ఞం నిర్వహించారు. లోక కళ్యాణార్థం లక్ష్మీనరసింహయజ్ఞం విశ్వశాంతి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ రాజమహేంద్ర చైర్మన్ శ్రీమాన్ శివానంద నిమయి దాస్, మేనేజర్ శ్యామ్ సత్యధర్మదాస్, రావులచెరువు రామాలయం కమిటీ సభ్యులు, భక్తులు, జనుపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

రాష్ట్ర స్థాయిలో మెడల్ సాధించిన వేద సంహిత



వేద సంహిత

అమలాపురం రూరల్: కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి బాలికల విభాగం కరాటే పోటీల్లో ది అమలాపురం జూనియర్ కళాశాల విద్యార్థిని వేద సంహిత రాష్ట్రంలో రెండో స్థానం సాధించింది. రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ కరాటం సూరిబాబు గురువారం తెలిపారు. విద్యార్థి వేద సంహితను కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దింశెట్టి రాంబాబు, డైరెక్టర్లు నాయుడు, కిరణ్, సతీష్‌లు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ల హల్‌చల్

కాట్రేనికోన: మండల కేంద్రం కాట్రేనికోనలో గురువారం చైన్ స్నాచింగ్ ముఠా హల్ చల్ చేసింది. నడవపల్లికి చెందిన ఒక మహిళ మెడలో బంగారు గొలుసును దొంగలు లాక్కుని పారిపోయారు. ఈ సమాచారం తెలియగానే ఎస్సై ఐ.అవినాష్ ఘటన స్థలానికి చేరుకుని దొంగలు కోసం వేట ప్రారంభించారు. గొలుసు పూర్తిగా కాకుండా కొంత భాగం మాత్రమే పట్టుకుని పోయాని ఎస్సై తెలిపారు. అనుమానితులను విచారించి ఈ ఘటనతో సంబంధం లేకపోవడంతో వదిలేసామన్నారు. దొంగల కదలికలపై సీసీ కెమెరాలు పరిశీలిస్తామన్నారు.

నేడు కాకినాడలో విద్యార్థులకు పోటీలు

తాళ్లరేవు: అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాలు–2024లో భాగంగా శుక్రవారం కాకినాడలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. కాకినాడ వివేకానంద పార్క్‌లోని బ్రాంచి లైబ్రరీలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ త్రూ కోఎగ్జిస్టెన్స్ అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని, ఇతర వివరాలకు 99127 03697 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గ్రీవెన్స్ ఆఫీసర్‌గా మారన్ నియామకం

యానాం: ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించడానికి వీలుగా పుదుచ్చేరి రాజ్‌నివాస్‌లో నార్త్ ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ సూపరింటెండెంట్ కె.మారన్‌ను నియమిస్తూ రాజ్‌నివాస్ కార్యాలయం ఆదేశాలు జారీచేసింది. మారన్ పుదుచ్చేరి నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి అనేక చర్యలు తీసుకుని ప్రశంసలు పొందారు.

వైభవంగా శరన్నవరాత్రుల ఆరంభం

- తొలిరోజు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా అమ్మవారు దర్శనం
- 108 కలశాల గోదావరి జలాలతో ఆర్యవైశ్య మహిళల యాత్ర



నీలపల్లిలో నవచండీ సహిత ఉత్సవాల్లో అమ్మవారికి పూజలు చేస్తున్న వేదపండితులు



అమలాపురంలో 108 కలశాల గోదావరి జలాలతో యాత్ర నిర్వహిస్తున్న ఆర్య వైశ్య మహిళలు



ముమ్మిడివరంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: పట్టణంలో అమ్మవార్ల ఆలయాల వద్ద శరన్నవరాత్ర మహోత్సవాలు గురువారం ఉదయం శాస్త్రోక్తంగా, వైభవంగా ఆరంభమయ్యాయి. స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో విజయ దశమి ఉత్సవాలు కనులపండువగా సాగాయి. తొలి రోజు అమ్మవారు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో పలు రకాల హోమాలు జరిగాయి. వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో శరన్నరాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోనిశ్రీవైష్ణవి కనకదుర్గ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా తొలిరోజు అమ్మవారు స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక కల్వకొల నువీధిలో వేప చెట్టు కనకదుర్గ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలను మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను దంపతులు కర్తలుగా పూజలు చేసి ప్రారంభించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణదుర్గ అమ్మవారి ఆలయంలో తొలి రోజు అమ్మవారు స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

108 కలశాలతో వాసవీమాతకు జలాభిషేకం

స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు 108 కలశాలను చేతపట్టి గడియారం స్తంభం సెంటర్ నుంచి అమ్మవారి ఆలయం వరకూ కలశ యాత్ర చేపట్టారు. యాత్ర అయ్యాక 108 కలశాల్లో ఉన్న పవిత్ర గోదావరి జలాలతో అమ్మవారి జలాభిషేకం చేశారు. ఆర్య వైశ్య ప్రతినిధులు అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఆర్య వైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి తదితరులు శరన్నవరాత్ర మహోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

ఐ.పోలవరం: అమ్మవార్ల ఆలయాల్లో దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలు గురువారం తెల్లవారుజాము నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కనకదుర్గ అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు కుంకుమపూజలు చేశారు. మండలంలోని ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, జి.వేమవరం, ఎదుర్లంక, జి.మూలపొలం, పశువుల్లంక, పాతయింజరం, మురమళ్ల, కొమరగిరి, కేశనకుర్రు గ్రామాల్లోని కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లోను, ఇతర గ్రామాల్లో ఉన్న విజయదుర్గా ఆలయాలు, అమ్మవారి ఆలయాల్లో ఉదయం భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. మురమళ్ల వాసవీ కన్యకాపరమేశ్వరి సత్రంలో ఈ దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం, సాయంత్రం అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే దుర్గమ్మ ఆలయాల వద్ద భారీ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ, మేళ తాళాలు ఆలయ కమిటీలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేశనకుర్రులోని కామేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు.



తాళ్లరేవులో బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు



కేశనకుర్రులోని కనకదుర్గ అమ్మవారు

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: మండలంలో దేవి శవన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా చలువ పందిళ్లు ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని ప్రత్యేక అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తొలిరోజు గురువారం అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. హైస్కూల్ సెంటర్‌లోని దుర్గాంబికా అమ్మవారి 16వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముమ్మిడివరం, ఠానేల్లంక, లక్ష్మీదేవిలంక, క్రాప చింతలపూడితో పాటు పలు గ్రామాల్లో దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రముఖ ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని తొలిరోజు బాలాత్రిపుర సుందరి అలంకరణలో పూజలు నిర్వహించారు. ప్రధానంగా తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసిన కనకదుర్గ ఆలయం, వాసవీమాత ఆలయం, గ్రాంటులోని పాల కనకదుర్గమ్మ ఆలయం, జార్జిపేట దుర్గామల్లేశ్వరస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంజరంలోని హరశ్రీ నిలయంలో భాగ్యశ్రీ అమ్మవారి అలంకరణలో పూజలు చేశారు. నీలపల్లిలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంచర్ల వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పంచమ నవ చండీసహిత శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా వేద పండితుడు శ్రీ ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు. వెంకన్నబాబు, అన్నపూర్ణ దంపతులతో రెండేళ్ల పాపను బాలాత్రిపుర సుందరిగా అలంకరించి నవకన్య పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కామనగరువులో..

అమలాపురం రూరల్: కామనగరువు ఆదిత్య స్కూల్‌లో దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ నృత్య ప్రదర్శనలు, స్కిట్స్ ప్రదర్శించారు. దసరా పురస్కరించుకొని నవదుర్గల వేషధారణలో పిల్లలు ప్రదర్శించిన నాట్యం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ రామప్రసాద్ విజయ దశమి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన చెడీ తాలింఖానా, రావణ దహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.శేషారెడ్డి, డైరెక్టర్ శృతి రెడ్డి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చలపతి రావు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ అభినందించారు.



కామనగరువులో నవదుర్గల వేషధారణలో విద్యార్థులు

బాలాత్రిపుర సుందరిగా శారదాదేవి



బాలాత్రిపుర సుందరి అలంకరణలో శారదాదేవి, లలితాదేవి

యానాం: పట్టణంలో కొలువైన శారదాదేవి గురువారం బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అలాగే పడవల రేవులోని లలితాదేవి ఆలయంలో సైతం అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. జూనియర్ నాజర్ కుమారులు బాబ్జీ అండ్ పార్టీ ఉత్తరాభిమన్యుల కల్యాణం బుర్ర కథ వినిపించారు. ఈ కార్యక్రమంలో లలితా భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



యానాంలో కొలువైన శ్రీవేంకటేశ్వర స్వామి

యానాం: శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి(మీసాలవెంకన్న) బ్రహ్మోత్సవాలు యానాంలో ఈ నెల 4 నుంచి 13వ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సువర్ణ పుష్పార్చన, ముత్యాల హారతి, సహస్ర నామార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 4న శ్రీగురుదత్తా బ్రాహ్మణ సేవా సమితి, 5న శ్రీవారి బ్రహ్మోత్సవ హంసవాహన కాపు ఉత్సవ కమిటీ, 6న కాకతీయ కమ్మ సంఘం, 7న శ్రీరజక సంఘం ఉత్సవదారులుగా వివిధ కార్యక్రమాలు, 8న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆర్యవైశ్య సంఘం ఉత్సవదారులుగా స్వామివారి కళ్యాణం, 9న ఆది ఆంధ్రా సంక్షేమ సంఘం, 10న క్షత్రియ పరిషత్,, 11న శ్రీకృష్ణచైతన్య యాదవ సంఘం, 12న అగ్నికుల క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు, 13న వర్షవర్ధన హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరవుతారని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, దేవస్థాన టెంపుల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఖండవల్లి రామకృష్ణ, తెలిపారు.

బెల్టు షాపులపై దాడి



బలుసుతిప్పలో స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

కాట్రేనికోన: బలుసుతిప్ప గ్రామంలో బెల్టు షాపుపై దాడి చేసి, 180 ఎంఎల్ 173 మద్యం బాటిళ్లు, రూ.2500ను స్వాధీనం చేసుకున్నట్లు కాట్రేనికోన ఎస్సై అవినాష్ తెలిపారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న సంగాని వీరబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ.12,500 ఉంటుందన్నారు. అలాగే కొత్తపాలెంలో బెల్టు షాపుపై దాడి చేసి 10 మద్యం, 10 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒకరిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వెటరన్ క్రీడాకారిణి షహీరాకు సన్మానం



వెటరన్ క్రీడాకారిణి షహీరాను సత్కరిస్తున్న జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: విశ్రాంత ఉద్యోగిగా, వెటరన్ క్రీడాకారిణిగా మెహబూబ్ షహీరా 70 ప్లస్ వయస్సులో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఎన్నో క్రీడా పోటీల్లో ఎన్నో విజయాలు, మరెన్నో పతకాలు సాధించిన మెహబూబ్ షహీరా అమలాపురానికి పేరు తెస్తున్నారని జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ సాయి వరప్రసాద్ అన్నారు. స్థానిక ఏవీఆర్ నగర్‌లోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో గురువారం జరిగిన సమావేశంలో సాయి వరప్రసాద్ ప్రసంగించారు. ఉర్దూ పండిట్‌గా పనిచేస్తూనే వెటరన్ క్రీడాకారిణిగానే కాకుండా ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా షహీరా నేటికీ క్రీడా స్ఫూర్తితో పోటీలకు హాజరవడం అభినందనీయమన్నారు. ఆమె ఇప్పటి వరకూ దాదాపు 250 పతకాలు సాధించారంటే వెటరన్ క్రీడాకారిణిగా ఆమె క్రీడా ప్రతిభ తేటతెల్లమవుతోందన్నారు. షహీరాతో పాటు విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ రంకిరెడ్డి కాశీ, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు మునగాల మన్యం, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, గెద్దం భీమరాజులను కూడా జిల్లా అసోసియేషన్ ఘనంగా సత్కరించి అభినందించింది. ఈ ఆరుగురు జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్‌లో సభ్యులు కావడం తమ అసోసియేషన్‌కు గర్వ కారణమని పెన్షనర్ల ప్రతినిధులు స్పష్టం చేశారు. అలాగే విశ్రాంత సహకార అధికారి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడిగా, కవిగా సేవలు అందిస్తున్న బీవీవీ సత్యనారాయణను కూడా అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు.

డ్రాయింగ్ పోటీల్లో విజేతలు వీరే..

యానాం: స్వభావ్ స్వచ్ఛతా–సంస్కార్ స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీల్లో విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగంలో పి లోకేశ్వరి, పి సుమ, ఎం అనిరుధ్, ఎస్ కావ్యఅరుణ, టి హన్సుజా, ఎంఎస్‌డీ అమృతవల్లి, యాళ్ల వీవీఏ అక్షయ, ఎం కల్యాణ్ ప్రైవేట్ స్కూల్ విభాగంలో జూనియర్, సీనియర్స్ విభాగంలో విజేతలుగా నిలిచారన్నారు. అదేవిధంగా ప్రభుత్వస్కూళ్ల విభాగంలో కళ్లారి సుధాంజలి, తీగల అంజలి, ఎల్ నిశ్చిత్రీ, బి అక్షయ, ఎం శ్రావణి, పి గౌతమి, ఐ శివశంకర్, ఎస్ హేమవెంకట ప్రవల్లిక జూనియర్, సీనియర్స్ విభాగంలో బహుమతులు సాధించారన్నారు. ఆర్‌పీఓ మునిస్వామి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ దేవానాంప్రియ, ఎం శ్రీనివాస్‌కుమార్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఆర్‌పీఓ

అధికారులు సమన్వయంతో పని చేయాలి



ఉప్పలగుప్తం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: మండల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపీపీ దంగేటి వీరఅచ్యుత జానకి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సమావేశం ముందుకు తీసుకువచ్చారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ సమాజంలో విద్య, వైద్యకు అతి ప్రాముఖ్యత ఉందని అధికారుల నిర్లక్ష్య ధోరణితో వాటిపై పర్యవేక్షణ లోపాలు కనిపిస్తున్నాయన్నారు. మండలంలో రెండు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సక్రమమైన భోజనం అందడం లేదని అధికారులు వాటిపై దృష్టి సాగించాలని సూచించారు. మండలంలోని ఎస్.యానం, వాసాలతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలకు నాడు–నేడులో నిధులు మంజూరైన పనులు ఎందుకు చేపట్టడం లేదని ఆ శాఖ అధికారులను ప్రశ్నించారు. గ్రామాల్లో కొన్ని ఇబ్బందులు రీత్యా పనులు సాగడం లేదని వాటిపై చర్య తీసుకుంటామని ఎంఈవో సత్యకృష్ణ సమాధానమిచ్చారు. గోపవరం, మునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉండక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు సమావేశంలో చర్చించారు. మండలంలో గోపవరం, విలసవిల్లి గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంపీటీసీలు సలాది సురేఖవాణి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నంగవరంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌కు కరెంట్ సరఫరాకు గ్రాంటు మంజూరు చేయలేదని వైద్యాధికారి నాగార్జునను సర్పంచ్ జిన్నూరి వెంటేశ్వరరావు నిలదీయగా మా పరిధిలో లేదని ఒకసారి, పనులు పూర్తి కాలేదని మరోసారి పొంతన లేని సమాధానాలు ఇవ్వటంతో సర్పంచ్ తీవ్ర ఆగ్రహం చెందారు. వ్యవసాయాధికారి కుమార్ బాబు మాట్లాడుతూ మండలంలో కూనవరం డ్రెయిన్ తవ్వకాలు లేకపోవటంతో 2 వేల ఎకరాల్లో పంట పూర్తి స్థాయిలో పాడవుతుందని, ఉపాధి పనుల్లో రెవెన్యూ డ్రెయిన్‌లను ఆధునీకరించాలని కోరారు. ఆయనకు రైతులకు అందుబాటులో ఉండే విధంగా సొసైటీల సహకారంతో డ్రోన్లను తీసుకుని రావాలని సర్పంచ్ బుల్లియ్య సూచించారు. ప్రధాన శాఖలైన రెవెన్యూ, డ్రెయిన్స్, ఇరిగేషన్, వెలుగు శాఖలతో పాటు పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరవడంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, చిక్కం జంగమయ్య, వాకపల్లి ఈశ్వరి, ఎంపీటీసీలు పెట్టా అప్పారావు, దేశంశెట్టి నాగరత్నకుమారి, చిక్కం త్రినాథ, భోగిశెట్టి సత్యవతి, వంగా గిరిజాకుమారి, తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో మూర్తి, ఈవోపీఆర్డీ గౌరీకుమారి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు సురేష్ మృతి



దొమ్మేటి సురేష్ (ఫైల్)

అల్లవరం: బోడసకుర్రు–1 ఎంపీటీసీ సభ్యురాలు దొమ్మేటి శ్రీశాంతి భవాని భర్త వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దొమ్మేటి సురేష్ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. సురేష్ ఇటీవల స్వల్ప అనారోగ్యంతో అమలాపురం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు సూచించడంతో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యాంప్రకాష్ హుటాహుటిన కాకినాడ తరలించే ప్రయత్నంలో మార్గంమధ్యలో సురేష్ తుది శ్వాస విడిచారు. సురేష్ మృతికి మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్, మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సంతాపం తెలిపారు. బోడసకుర్రులోని ఆయన నివాసం వద్ద సురేష్ మృతదేహాన్ని మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ అమలాపురం టౌన్ అధ్యక్షుడు సంసాని నాని, ఎంపీటీసీలు గుబ్బల బాబ్జి, మాకే సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

ఇంటి వద్దకే ఉచిత బియ్యం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో ఉచిత బియ్యాన్ని రేషన్‌కార్డు దారుల ఇంటి వద్దకే ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు గురువారం సివిల్ సప్లయిస్ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో గతంలో జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రీతిలో ఈ పథకాన్ని తమ రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించారు. కొన్నేళ్లపాటు రేషన్‌దుకాణాల ద్వారా బియ్యం తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ జరిగినప్పటికి అనంతరం నగదు బదిలీ ద్వారా బియ్యంకు బదులు లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో సొమ్ము జమ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలి గతంలో వలే తిరిగి రేషన్‌షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేపట్టనున్నట్లు సీఎం రంగసామి ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం ఎల్జీ కైలాష్‌నాథన్‌తో సీఎం రంగసామి సమావేశమవగా ఉచిత బియ్యం పథకంపై చర్చించారు.

డంపింగ్ యార్డ్ తొలగించాలని నిరసన



డంపింగ్ యార్డ్ తొలగించాలని నిరసన తెలుపుతున్న గ్రామ ప్రజలు

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో డంపింగ్ యార్డ్ తొలగించి ప్రజలు ఆరోగ్యం కాపాడాలని కోరతూ శివాలయం వద్ద మహిళలు, గ్రామస్తులు నిరసన తెలిపారు. ఎన్నిసార్లు పంచాయతీ చుట్టూ తిరిగినా, ప్రయోజనం లేక అక్టోబర్ 2 తరువాత చెత్త ట్రాక్టర్లు నిలిపివేస్తామని చెప్పిన ఫలితం లేకపోయింది. దీంతో గురువారం మరోసారి నిరసన చేపట్టారు. డంపింగ్‌యార్డ్ తొలగించే వరకు నిరసన ప్రదర్శన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దైవపూర్ణిమ, చింతా మణి, కొండా మల్లి, బిళ్ల లక్ష్మి, కొండా సూర్యకుమారి, బండారు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ADITHE SATYANARAYANA (ASN) P.G. COLLEGE
ICET CODE ASBA - AMALAPURAM,
Dr. B.R.Ambedkar Konaseema Dist.,
Ph: 08856-232125, Mobile: 9948574846

SPOT ADMISSIONS - APICET - 2024
Date & Time : 5.10.2024 at 10.00 am.

MBA SPOT ADMISSIONS

Sport Admissions will be conducted for vacant seats available in MBA course due to non-reporting and cancellations & left over seats after ICET-2024 counselling as per APSCHE guidelines. All the eligible and interested candidates may attend the spot Admission in college campus on 5-10-2024 by 10 am. Along with all original certificates. Candidates admitted through spot admissions are not eligible for fee reimbursement.

Date: 03-10-2024 Secretary & Correspondent.